
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 27 సెప్టెంబరు 2025





ధనలక్ష్మీ కటాక్షించు !

భీమవరంలో రూ.2 కోట్లతో అలంకారం

శరన్నవరాత్రి ఉత్సావాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు. శుక్రవారం అమ్మవార్లను మహాలక్ష్మీగా అలంకరించారు. భీమవరం ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని భక్తులు అందించిన సుమారు 2 కోట్ల రూపాయలతో అలంకరించారు. నగదుతో పాటు బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అలంకారంలో ఉంచారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు.

- భీమవరం టౌన్ (ఆంధ్రజ్యోతి)





9,116 మందికి వాహన మిత్ర

పెండింగ్‌లో 290.. రిజెక్ట్ అయినవి 69

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లుకు, క్యాబ్ డ్రైవర్లను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహనమిత్రలో 15 వేల రూపాయలు అందించే కార్యక్రమంలో 9,116 దరఖాస్తులు ఆమోదం పొందాయి. వచ్చిన దరఖాస్తుల్లో 229 దరఖాస్తులు వివిధ కారణాల వల్ల అధికారులు పెండింగ్‌లో పెట్టారు. 69 దరఖాస్తులు రిజెక్ట్ చేశారు. ఆర్‌టీవో లాగిన్ నుంచి 9,116 దరఖాస్తులు కలెక్టర్ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపించారు. వీటిని స్క్రూటినీ చేసి అర్హత సాధించిన దరఖాస్తులు ప్రభుత్వానికి పంపనున్నారు. ఇందులో పెండింగ్‌లో ఉన్న 229 దరఖాస్తులకు సంబంధించి అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన వాటికి దరఖాస్తుదారులు సమాచారం అందించాలి. సంబంధిత గ్రామ సచివాలయాలను సంప్రదించాల్సి ఉంటుంది. 69 దరఖాస్తులు మాత్రం అనర్హత సాధించడంతో వాటిని పక్కన పెట్టేశారు. వచ్చేనెల 2న వాహనమిత్ర దరఖాస్తుదారుల బ్యాంకు అక్కౌంట్‌లలో రూ.15 వేలు నగదు జమ కానుంది.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ, అధికారులు

అక్టోబరు 10 లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు : జేసీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర అందించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించారు. అక్టోబరు 10 లోపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎదురవుతున్న తేమ శాతం సమస్యను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ బానో, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఏవో నారాయణరావు పాల్గొన్నారు.

పల్లెల్లో ఆదాయం పెంపు



గ్రామాల్లో ఆదాయం పెంచే దిశగా పంచాయతీ రాజ్ శాఖ కసరత్తు చేస్తోంది. పంచాయతీలకు ఆస్తిపన్ను రూపంలో ప్రధానంగా ఆదాయం లభిస్తోంది. అది తక్కువగా ఉన్నట్టు జిల్లా అధికారులు గుర్తించారు. జిల్లాలోని ఓ పంచాయతీలో గోప్యంగా పంచాయతీరాజ్ అధికారులు సర్వే చేశారు. ఆ గ్రామంలో ఏకంగా వంద శాతం పన్ను పెరిగింది. వాస్తవానికి సదరు పంచాయతీలో తొమ్మిది నెలలుగా సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే అందరికీ కొత్త డిమాండ్ నోటీసులు జారీ చేయనున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- కసరత్తు చేస్తున్న అధికారులు
- అసెస్‌మెంట్‌లపై సర్వే
- 40 శాతం ఆస్తి పన్ను పెరిగే అవకాశం
- జిల్లాలో 31వేల అసెస్‌మెంట్‌లు
- రూ. 31 కోట్ల ఆదాయం
- ఓ గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌గా సర్వే
- వంద శాతం పెరిగిన పన్ను
- త్వరలోనే డిమాండ్ నోటీసులు


గడచిన కొన్నేళ్లుగా గ్రామాల్లో అసెస్‌మెంట్‌లను సర్వే చేయలేదు. ఎవరికి వచ్చిన రీతిలో పరిశీలించి పన్ను వేస్తున్నారు. వైసీపీ హయాంలో తమకు గిట్టని సంస్థలు, నాయకుల ఇళ్లను సర్వే చేసి పన్ను పెంచే ప్రయత్నం చేశారు. ఇప్పుడలా కాకుండా పంచాయతీకి ఆదాయ మార్గాలు అన్వేషించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాకు నిధులు సమకూరుతాయని అధికారులు భావిస్తున్నారు. అధికారులు ఇటీవల ఒక గ్రామంలో సర్వే చేస్తే ఆదాయం రూ.10 లక్షలకు చేరింది. గతంలో రూ. 5 లక్షలు మాత్రమే వచ్చేది.ప్రభుత్వ స్థలాల్లో ఉన్న కొబ్బరి చెట్లు పాట పెట్టారు. మూడేళ్లకు రూ. 3.60 లక్షలకు రైతులు పాడుకున్నారు. అధికారులు స్థానికంగా రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. సానుకూలంగా రైతులు స్పందించి పాట పాడుకోవ డంతో పంచాయతీకి ఆదాయం లభించింది. ఇలా అన్ని గ్రామాల్లోనూ ఆదాయం పెంచే దిశగా ప్రణాళిక రచిం చారు. త్వరలోనే అన్ని పంచాయతీలకు ఆదేశాలు జారీ చేయనున్నారు.

జిల్లాలో అసెస్‌మెంట్‌కు సన్నాహాలు

జిల్లాలో ప్రస్తుతం 31 వేల అసెస్‌మెంట్‌లున్నాయి. వాటినుంచి జిల్లాలోని పంచాయతీలకు ఏటా రూ.31 కోట్లు ఆదాయం లభిస్తోంది. పాత ఇళ్ల స్థానంలో కొత్తవాటిని నిర్మించుకున్నారు. పెంకిటిళ్లను పక్కా భవనాలుగా తీర్చి దిద్దుకున్నారు. కానీ పాతపద్ధతిలోనే పన్ను చెల్లిస్తున్నారు. ఇంటిపై అంతస్తు వేసుకున్నా సరే పన్ను చెల్లించడం లేదు. వాటన్నింటినీ మదింపు చేసి కొత్త పన్ను వేయనున్నారు. దీనివల్ల పంచాయతీలకు ఆదాయం పెరుగుతుంది. ప్రతి ఒక్కరూ కచ్చితమైన పన్ను చెల్లించే అవకాశం ఉంటుంది. పంచాయతీల నిర్వహణకు నిధుకోసం ఎదురుచూసే దుస్థితి తప్పుతుంది. జిల్లాలోని కొన్ని పంచాయతీల్లో ఇప్పటికే మదింపు చర్యలు చేపట్టారు. కార్యదర్శులే చొరవ తీసుకుంటున్నారు. దీనివల్ల లక్షల రూపాయల ఆదాయం పెరిగింది. వైసీపీ హయాంలో ఉన్న బకాయిలను చెల్లించే స్థితికి పంచాయతీలను తీసుకువెళుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే తరహాలో మదింపు చేస్తే 40 శాతం ఆదాయం పెరగొచ్చు.

మునిసిపాల్టీల్లో ఇంటింటి సర్వే

వార్డుల వారీగా ప్రత్యేక టీమ్‌లు
మూడు వార్డులకు ఒక సూపర్ వైజర్
వచ్చేనెల 10వ తేదీలోగా సర్వే



భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మునిసి పాల్టీల్లో ఆదాయ వనరుల పెంపుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. సచివాలయ ఉద్యోగులతో మరోసారి ఇంటింటా సర్వే నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి వార్డుల వారీగా టీమ్‌లను నియమించారు. ఒక సచివాలయ ఉద్యోగులను మరొక సచివాలయానికి నియమించి ఈ సర్వేను చేపట్టనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 6 మునిసిపాల్టీల నుంచి రూ 71.96 కోట్లు వసూలు చేస్తున్నారు. దీనిని మరో 20 శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. అంటే ఉన్న ఆదాయానికి మరో రూ 14.4 కోట్లు పెంచాల్సి ఉంది. గతంలో 3 నెలలుగా ఈ సర్వే జరుగుతోంది. సర్వే టీమ్‌లో ఐదుగురు సభ్యులు ఉంటారు. అడ్మిన్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ, ఇంజనీరింగ్ విభాగం సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఉమెన్ ప్రొటక్షన్ సభ్యురాలు, డేటా ప్రోసెసింగ్ అధికారితో టీమ్ ఏర్పాటు చేశారు. మూడు వార్డులను పరిశీలించేందుకు మునిసిపల్ అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, రెవెన్యూ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, పర్యవేక్షణలో ఈ సర్వే జరుగుతుంది. ఖాళీ స్థలాలను గుర్తించి పన్నులు వాటికి వెయ్యడంతో పాటు, పన్నులు తక్కువగా ఉన్నవాటికి పన్నులు పెంచేలా చర్యలు తీసుకుంటారు. వార్డుల్లో నూటికి నూరుశాతం ఇళ్ళను సర్వేచేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలోని ఆరు మునిసిపాల్టీల్లో పన్నుల వివరాలు

మునిసిపాల్టీ	ప్రస్తుత పన్ను (రూ.కోట్లలో)	పెంచనున్న డిమాండ్
పాలకొల్లు	9.27	1.65
తణుకు	14.07	2.81
భీమవరం	24.11	4.82
టీపీగూడెం	15.60	3.12
నరసాపురం	6.78	1.35
ఆకివీడు	3.13	0.62 లక్షలు
మొత్తం	71.96	14.37

వచ్చేనెల 9,10 తేదీల్లో పెన్షన్, జీపీఎఫ్ సమస్యల పరిష్కారానికి అదాలత్ : కలెక్టర్

భీమవరంటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : భీమవరంలో వచ్చేనెల 9,10 తేదీల్లో రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌చే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా ఖజానా, ఖాతాల అధికారి ఆడారి గణేష్ ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతి ప్రియ, రాష్ట్ర ఖజానా, లెక్కల అధికారి నేతల మోహనరావు, అకౌంటెంట్ జనరల్, ఖజానా శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ శాఖల డీడీవోల వద్ద అపరిష్కృతంగా ఉన్న పెన్షన్, జీపీఎఫ్, మిస్సింగ్ క్రెడిట్స్, డెబ్స్ పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులకు సమర్థవంతమైన, సకాలంలో సేవలు అందేలా చూడటం కోసం జిల్లాలోని అన్ని శాఖల ప్రధాన అధికారులకు (డీడీవో)లకు తగు సూచనలను ఇస్తారన్నారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు(పెన్షనర్స్), అన్ని శాఖల డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు ఈ సమావేశాలకు విధిగా హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

పంచాయతీ నిధులకు రెక్కలు

పక్కదారి పడుతున్న సొమ్ములు
మొన్న రాయలం, చిన అమిరంలో దుర్వినియోగం
తాజాగా దిరుసుమర్రులో రూ. 90 లక్షలు పక్కదారి
సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు



భీమవరం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సొమ్ములకు రెక్కలొస్తున్నాయి.. పాలకవర్గాలు, అధికారులు కుమ్మక్కయి పక్కదారి పట్టిస్తున్నారు.. భీమవరం రూరల్ మండలం రాయలం, చిన అమిరం గ్రామాల్లో రూ. 4 కోట్లు పైగా సొమ్ములు పక్కదారి పట్టాయి. తాజాగా దిరుసుమర్రు గ్రామంలో అధికారుల లెక్కల ప్రకారం రూ.90 లక్షలు దారి తప్పినట్లు తేల్చారు. నిధులు దుర్వినియోగంపై గ్రామ సర్పంచ్ కోళ్ళ బాలకృష్ణ చెక్ పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై సర్పంచ్ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ సొమ్ము గల్లంతు అభియోగం మీద అప్పటి దిరుసుమర్రు గ్రామ కార్యదర్శి కృష్ణమోహన్ మీద పీఆర్ కమిషనర్ లెటర్ పంపించినట్టు జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి ఏ.రామనాథరెడ్డి తెలిపారు. కృష్ణమోహన్ సస్పెన్షన్ నిర్ణయం తేలాల్సి ఉంది. దిరుసుమర్రు గ్రామం పంచాయతీ సొమ్ములు పక్కదారి పట్టినట్లు ఆరు నెలల క్రితం పాలకవర్గం ఉప సర్పంచ్ నుంచే ఫిర్యాదు వెళ్ళింది. దానిపై డీఎల్‌పీవో పంచాయతీకి సంబంధించిన లెక్కలను మూడు రోజులపాటు పరిశీలించారు. తదుపరి నివేదిక జిల్లా శాఖకు అందించారు. ఆ నివేదిక ప్రకారం రూ. 90 లక్షలు లెక్కల్లో తేడా ఉన్నట్లు తేల్చారు.

మూడు గ్రామాలకు అవినీతి మచ్చ

గ్రామాల అభివృద్ధికి పాటు పడాల్సిన పాలకవర్గాలు, పంచాయతీ అధికారులు పంచాయతీ సొమ్ములు పక్కదారి పట్టించడం విమర్శలకు దారితీస్తుంది. ఒక్క భీమవరం మండలంలోనే మూడు గ్రామాలకు మచ్చపడింది. రాయలం, చినఅమిరం గ్రామాల్లో పనిచేసిన సెక్రటరీ రూ. 4 కోట్లు పైన సొమ్ములు పక్కదారి పట్టించారు. దిరుసుమర్రులో సర్పంచ్, సెక్రటరీల మీద రూ. 90 లక్షల సొమ్ములు దారిమళ్లాయి. పరిపాలన చేయాల్సిన పాలకవర్గాలు, అధికారులు సొమ్ములు స్వాహా చేస్తే ఇక గ్రామాలు అభి వృద్ధి జరిగేదెలా అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అయ్యో దేవుడా..!

మాసూళ్ల సమయంలో ముసురు భయం



తాడేపల్లిగూడెం రూరల్,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంట మాసూళ్ల జరుగుతుండగా ముసురు రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాడేపల్లిగూడెం మండలం బోర్ల కింద సాగుచేసే ప్రాంతంలో ప్రస్తుతం ముమ్మర మాసూళ్ల జరుగుతున్నాయి.ఈ సమయంలో మబ్బులు, వర్షం పడుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో వరికోతలు కోస్తుండగా వర్షం పడటంతో రైతులు హడావుడిగా ధాన్యం బస్తాల్లోకి ఎక్కించారు.

గూడెం..ఘోష!

ఈ రోడ్లపై వెళ్లేదెలా ?



- అధ్వాన్నంగా మారిన దారులపై నడుంలు విరిగిపోతున్నాయి
- వాహనాలు షెడ్డుకు వెళుతున్నాయి
- ప్రైవేటు బస్సులు పట్టణంలోకి రానంటున్నాయి..
- రోడ్ల దుస్థితిపై అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే బొలిశెట్టి ఆవేదన

(తాడేపల్లిగూడెం అర్బన్-ఆంధ్రజ్యోతి):

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కొన్ని రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రధాన రహదారులు గోతులమయంగా మారడంతో వాహనదారులు ప్రయాణాలు చేయలేక ముప్పుతిప్పలు పడుతున్నారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ అమ్మవారి అలయం నుంచి ముత్యాలంబపురం ముత్యాలమ్మ ఆలయం వరకు రోడ్డుపై ప్రయాణమంటే ఓ సాహసమేనని చెప్పాలి. అసలు రోడ్డు వెతుక్కోవాల్సిన పరిస్థితి. పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి కాబట్టి రోజు వేల సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తారు. ఈ రోడ్డు దాటేసరికి ఒళ్లు హూనం అవుతుండడంతో పాటు వాహనాలు తరచూ పాడవుతున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాలకు వెళ్లాల్సిన చాలా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తాడేపల్లిగూడెం పట్టణంలోకి రావడం లేదు. ప్రత్తిపాడు బైపాస్ మీదకు వెళ్లి ఎక్కాల్సి వస్తోంది. అదే సమయంలో అక్కడే దింపేయడంతో అర్ధరాత్రి వేళల్లో ఈ ప్రాంతం ప్రమాదకరంగా ఉండడంతో బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటాల్సి వస్తోందని పలువురు వాపో తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరైనప్పటికి గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన పాత బకాయిలు విడుదల చేస్తేనే పనులు చేస్తామని కాంట్రాక్టర్ తెగేసి చెప్పడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి.

అధ్వానంగా పెంటపాడు-బోడపాడు, చింతపల్లి - కొండేపాడు

వైసీపీ ప్రభుత్వం పెంటపాడు-బోడపాడు రహదారి వైపు కన్నెత్తి చూడకపోవడంతో గోతులతో అధ్వానంగా మారింది. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయించినా నిధులు విడుదల కాలేదు. మరమ్మతుల కోసం వచ్చిన రూ.25 లక్షలతో కిలోమీటర్ మేర రహదారి వేయించారు. ఇంకా మూడు కిలోమీటర్లు వేయించాలి. చింతపల్లి-కోరుమిల్లి మీదుగా బి.కొండేపాడు వెళ్లే రహదారి పరిస్థితి ఇదే మాదిరి వుంది. 2014లో జెడ్పీ చైర్మన్‌గా వున్న ముళ్లపూడి బాపిరాజు ఈ రహదారిని వేయించారు. అప్పటి నుంచి ఈ రహదారి వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. ప్రస్తుతం రాళ్ల మొత్తం పైకి లేచి అధ్వానంగా తయారైంది. మూడు గ్రామాల ప్రజలు నరకం చూస్తున్నారు.

గోతులమయంగా అలంపురం-రాచర్ల రహదారి

ఇటీవల కురిసిన వర్షాలకు అలంపురం నుంచి రాచర్ల వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. ఆ దారిలో ప్రయాణాలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెంటపాడు నుంచి అలంపురం మీదుగా తణుకు వైపు వెళ్లాలంటే దూరం తక్కువని ద్విచక్ర వాహనదారులు ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. కానీ రహదారి పాడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



వర్షాలకు గోతులు పడి ధ్వంసమైన అలంపురం రాచర్ల రహదారి

ఏళ్ల తరబడి ఇదే సమస్య



పెంటపాడు నుంచి బోడపాడు వెళ్లే రహదారి గోతులతో ప్రమాదకరంగా తయారైంది. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. రాత్రి వేళల్లో ప్రయాణాలు మరింత ప్రమాదకరంగా మారాయి. వ్యాపారం నిమిత్తం రోజుకు మూడు, నాలుగుసార్లు తాడేపల్లిగూడెం వెళ్లి వస్తాను. ఈ దారి తప్ప మరో మార్గం లేదు.

బాదంపూడి వీర రాఘవరావు, కిరాణా వ్యాపారి, బోడపాడు

ప్రజల ముందుకు వెళ్లలేం : ఎమ్మెల్యే బొలిశెట్టి

అసెంబ్లీ సమావేశాలలో నియోజకవర్గంలో రహదారుల దుస్థితిపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కాస్త గట్టిగానే మాట్లాడారు. గూడెం ప్రధాన రహదారి కూడా గోతుల మయంగా మారిపోయింది. టూరిస్టు బస్సులు కూడా సిటీలోకి రావడం లేదు.పాత బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించడం లేదు. అడిగితే ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు. రహదారులు వేయలేకపోతే ప్రజలవద్దకు వెళ్లలేమని రహదారులను అభివృద్ధి చేయించాలని అసెంబ్లీలో కోరారు.

ఊర్లోకి రావాలంటే భయపడుతున్నారు



పెంటపాడు నుంచి మా ఊరిలోకి రావా లంటే జనం కూడా భయపడి పోతున్నారు. ఇప్పటికే ఎంతో మంది ద్విచక్ర వాహనాలపై నుంచి పడి క్షతగాత్రులయ్యారు. మహిళలు, గర్భిణులు ఈ దారిపై ప్రయాణం చేయాలంటే ఓ సాహసమేనని చెప్పాలి. ఏళ్ల తరబడి రోడ్డు కోసం ఎదురు చూస్తున్నాం. కనీసం కూటమి ప్రభుత్వంలో నైనా మా రోడ్డుకు మంచి రోజులు వస్తాయని భావిస్తున్నాం

- గూడూరి వెంకట సత్యనారాయణ, రైతు, బోడపాడు

సిరి మహాలక్ష్మి



తాడేపల్లిగూడెం పట్టణంలో వరిదుబ్బులతో అన్నపూర్ణాదేవిగా విశ్వదుర్గేశ్వరి అమ్మవారు.







తాడేపల్లిగూడెం వాసవీ మాతకు రూ.1.5 కోట్ల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకరణ, కాళ్లలో రూ.42 లక్షలతో మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి, ఆకివీడులో రూ.60 లక్షలతో దుర్గమ్మకు మహాలక్ష్మి అలంకరణ

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వాసవీ పంచాయతన క్షేత్రంలో వాసవీ మాతకు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రూ.1.5కోట్లతో ధనలక్ష్మి అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో రూ.60లక్షల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. సుమారు నెల రోజుల నుంచి నోట్లు సేకరించామని నిర్వాహకులు ఓలేటి శ్రీను, గుర్రం ఈశ్వరరావు తెలిపారు.

కాళ్ల: శరన్నవరాత్రి వేడుకల్లో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దొడ్డనపూడి రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని రూ.42 లక్షలతో మహాలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 200 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు.



మహాలక్ష్మి అలంకారంలో మావుళ్లమ్మ

















మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, పెనుగొండ వాసవీ మాత, ఆచంట పార్వతీదేవి, భీమవరం మెంటేవారి తోట దుర్గమ్మ, అన్నపూర్ణగా సోమేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు, ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాదేవి, పాలకొల్లులో ధనలక్ష్మిగా దుర్గమ్మ, వైష్ణవీ దేవిగా వాసవీ మాత

'పేదలకు భరోసాగా సీఎం సహాయనిధి'



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు భరోసాగా సీఎం సహాయ నిధి దోహదపడుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల పార్టీ కార్యాలయంలో శుక్రవారం పలువురు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందించారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న దొండపాడుకు చెందిన ఆదిలక్ష్మీదుర్గకు వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15 లక్షలకు ఎల్‌వోసీ ఇచ్చారు. పెదపాడుకు చెందిన రామసాయికి సీఎం సహాయనిధి రూ.25 వేలను చెక్‌ను అందించారు.

టీడీపీ అభివృద్ధికి శ్రమించాలి : లక్ష్మీరమణి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):టీడీపీలో మండల అనుబంధ కమిటీల్లో పదవులు దక్కించుకున్న వారు పార్టీ అభివృద్ధికి శ్రమించాలని మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి అన్నారు. ద్వారకా తిరుమలకు చెందిన పలువురికి అనుబంధ కమిటీల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆశీస్సులతో పదవులు దక్కాయన్నారు. వీరిలో మండల వాణిజ్యవిభాగం అధ్యక్షుడిగా మహంకాళి గంగాధరరావును, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉర్ల శ్రీనివాసరావును ఆమె, టీడీపీ నేత మొగతడల ఓంప్రకాష్ చౌదరితో కలిసి శ్రీవారి చిత్రపటాలు అందించి సత్కరించారు.

'సుబ్బరాయన్ సేవలు అభినందనీయం'



సుబ్బరాయన్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ మోహినీ వెంకన్నబాబు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈవో పీఆర్‌డీగా పనిచేసి పదోన్నతి పొందిన సుబ్బరాయన్ సేవలు అభినందనీయమని ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోగా పదోన్నతి పొందిన సుబ్బరాయన్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె వైసీపీ తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబుతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. ఎంపీడీవో పీవీవీ ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బుట్టాయగూడెం సొసైటీని అభివృద్ధి చేస్తా : ఉమా



కొయ్యలగూడెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):బుట్టాయగూడెం సొసైటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సొసైటీ అధ్యక్షుడు కరాటం ఉమా అన్నారు. శుక్రవారం డీసీఎంఎస్‌లో జరిగిన సమావేశంలో ఆయనను ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ సన్మానించారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఇద్దరు ఛైర్మన్‌లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. తిరుమలాపురం సొసైటీ అధ్యక్షుడు బళ్లే రామచంద్రవరప్రసాద్ ఉన్నారు.

మల్లుకుంట సొసైటీ అభివృద్ధికి కృషి : సాయివినయ్



మాట్లాడుతున్న ఛైర్మన్ సాయివినయ్

టి.నరసాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్లుకుంట సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఛైర్మన్ సాయివినయ్ తెలిపారు. సొసైటీ ఆవరణలో ఛైర్‌పర్సన్ వినయ్ అధ్యక్షతన సొసైటీ మహాజనసభ శుక్రవా రం నిర్వహించారు. రైతుల సౌకర్యా ర్థం బొర్రంపాలెంలో ఎరువుల వ్యాపా రం, మినరల్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. కమర్షియల్ బ్యాంకుల తరహాలోనే సొసైటీ ద్వారా బంగారంపై రుణాలు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. సొసైటీ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. రైతుల సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సొసైటీ పర్సన్‌లు తలారి ఆంధ్రాబాబు, వెదుళ్ల వెంకటేశ్వరరావు, సీఈవో కేవీవీ.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

డీసీసీబీని లాభాల బాట పట్టిస్తాం



డీసీఎంఎస్ మహాజన సభలో మాట్లాడుతున్న ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

- ఆప్కాబ్,డీసీసీబీ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు
- ఏలూరులో డీసీఎంఎస్ మహాజన సభ

ఏలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును రూ.100 కోట్ల పైబడి నష్టాల్లోకి నెట్టేశారు.. మేము ఇప్పటికే ఆ నష్టాలను రూ.70 కోట్లకు తగ్గించాం. 2027 నాటికి డీసీసీబీని లాభాలబాట పటిస్తామని ఆప్కాబ్, డీసీసీబీ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు స్పష్టం చేశారు. డీసీఎంఎస్ జిల్లా మహాజన సభ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. గన్ని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.1 లక్ష 40 వేల కోట్ల టర్నోవర్‌తో ఆప్కాబ్ స్వతంత్రప్రతిపత్తి కలిగిన సంస్థగా నడుస్తోందని, త్వరలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద మొండి బకాయిల వసూళ్లకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో సొసైటీల కంప్యూటరీకరణ, సంస్కరణల ఫలితంగా దేశంలో ఉత్తమ ప్రతిభకు రెండో స్థానంలో సిమ్లాలో అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 13 డీసీసీబీలకు వెయ్యి కోట్లు బంగారు రుణాల అందజేతకు చర్యలు చేపట్టామన్నారు. వడ్డీ శాతం తగ్గించి సభ్యులకు రుణాలను అందిస్తామన్నారు. డీసీఎంస్‌కు గోడౌన్ల నిర్మాణానికి సహకరిస్తానని చెప్పారు. దీపావళి బాణసంచా అమ్మకాల ద్వారా సొసైటీలు లాభాలను ఆర్జించాలని సూచించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ మాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ డీసీఎంఎస్ రూ.2.79 కోట్ల నికర లాభాలను సాధించిందని, ఇందులో రూ.34 లక్షల సొసైటీలకు డివిడెండ్లుగా ఇస్తామన్నారు. రాబోయే కాలంలో రూ.200 కోట్ల వ్యాపారం చేయడానికి ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. ప్రైవేట్ డీలర్లకు దీటుగా కాంప్లెక్స్, ఇతర ఎరువులను కూడా సరసమైన ధరలకు 21 బ్రాంచిల ద్వారా అందిస్తామని చెప్పారు.

వ్యాపారాలు విస్తరించాలి..

డీసీఎంఎస్ ద్వారా మండలంలో వ్యాపారాలు విస్తరించాలని, ఎరువులు ప్రైవేట్ డీలర్లు అందించే ధరలకు బ్రాంచ్‌ల ద్వారా సరఫరా చేయాలని, మిశ్రమ ఎరువులను సిద్ధంగా ఉంచాలని. త్రిసభ్య కమిటీ ఛైర్మన్లు తాతా సత్యనారాయణ తదితరులు కోరారు. సమావేశంలో డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్, ఏలూరు డీఆర్ సత్యవతి, ఇతర సొసైటీల ఛైర్మన్లు కరాటం ఉమామహేశ్వరరావు, కుటుంబశాస్త్రి, కొత్తపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం : ఎంపీ మహేశ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జీలుగుమిల్లి వద్ద నేవీ ఆయుధ డిపో ఏర్పాటు జిల్లాకే తలమానికం అన్నారు. దేశంలో ఎన్నో ఆయుధడిపోలున్నాయని, వాటితో ప్రజలకు ఎటువంటి ముప్పు లేదన్నారు. జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కేవలం 1166 ఎకరాల్లో ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూమిని కోల్పోయే రైతులకు ఆర్‌ఆర్‌ప్యాకేజీ క్రింద పరిహారం చెల్లిస్తామన్నారు. అపోహలతో అభివృద్ధి కార్యక్రమాలకు ఎవరూ అడ్డుపడవద్దని విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు విద్య, ఉపాధి, వైద్యం అవకాశాలు లభించాలనేదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద గెయిల్ ఇండియా రూ.కోటి వైద్య పరికరాలను సమకూర్చినట్లు ఎంపీ పుట్టా మహేశ్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి రెండు అధునాతన అంబులెన్సులను కొద్ది రోజుల్లో అందిస్తానన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడారు. గెయిల్ ఇండియా జనరల్ మేనేజర్ నారాయణ, హెల్త్‌కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శరత్, డాక్టర్ ఎంఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని మండల ఉద్యానశాఖ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. మొక్కలు, ఎరువులు, యంత్రాలు సబ్సిడీపై అందిస్తుందని తెలిపారు. పట్టింపాలెంలో రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 350 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా మొక్కలకు రూ.29వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.పోతన్న, వైస్ ఎంపీపీలు సూర్పన రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా చిత్రలేఖనం పోటీ విజేతలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ 156వ జయంతి పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ చిత్రలేఖనం పోటీల విజేతల జాబితా జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం విడుదల చేశారు. పాఠ శాల స్థాయి సబ్‌జూనియర్ విభాగంలో పి.లీలా ఆశ్య (దర్శిపర్రు) ప్రథమ, వీఎస్.చక్రధర్(యలమంచిలి) ద్వితీయ, ఏవీఎస్.స్వాగత్ (నందమూరు గరువు) తృతీయ, హేమశ్రీ (శోభనాపురం) కన్సొలేషన్ బహుమతులు సాధించారు. జూనియర్స్‌లో పి.ఆనందిత (పెదనిండ్రకొలను), సీహెచ్.దీవెన (పత్తేపురం), ఎం.ఝాన్సీదేవి(భీమవరం), బి.హర్షిత(ఆకివీడు) విజేతలుగా నిలిచారు. సీనియర్స్‌లో పి.జోషిక(భీమవరం), ఎ.కావ్య శ్రావణి(తాడేపల్లిగూడెం), ఎస్ఎన్‌వీఎస్.బ్రాహ్మణి(గోపాలపురం), ఆర్.గౌరి నాగశ్రీ(కోపల్లె) బహుమతులు సాధించారు. కళాశాల స్థాయిలో పి.సాత్విక (పెదఅమిరం), ఎస్.ఎన్.శ్రీవర్ష (భీమవరం), డి.వెంకటలక్ష్మి(ఎఎస్.నగర్) విజేతలుగా నిలిచారు. అక్టోబరు 2న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వీఆర్‌కు కైకలూరు టౌన్ సీఐ

కైకలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దానగూడెం గొడవల నేపథ్యంలో కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణను వీఆర్‌కు బదిలీ చేశారు. గురువారం రాత్రి అధికారులు బదిలీ ఉత్తర్వులను అందజేశారు. దీంతో ఆయన ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు.



పోలీసుల అదుపులో నిందితులు, వివరాలు చెబుతున్న ఎస్పీ కిశోర్

నలుగురు దొంగలు అరెస్ట్

246 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధులపై దాడిచేసి 40 కాసుల బంగారం, రెండు కేజీల వెండిని దొంగిలించిన కేసులోని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన వందనపు లక్ష్మీకుమారి(63) ఆమె భర్త ఇంట్లో నిద్రిస్తుండగా ఈనెల 23న తెల్లవారు జామున ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి కర్రలతో కొట్టి 40 కాసుల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండిని అపహరించుకుపోయారు. లక్కవరం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రవిచంద్ర పర్యవేక్షణలో సీఐలు ఎంవీ.సుభాష్, క్రాంతికుమార్, ఎస్ఐ జబీర్, ఏఎస్ఐ సంపత్‌లతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ దోపిడీకి పాల్పడిన నలుగురని అరెస్టు చేశారు. లక్కవరం గ్రామానికి చెందిన దేవర శ్రీరామమూర్తి, చెందిన షేక్ బాజీ కలిసి బాపట్ల మండలం సువర్ణపురానికి చెందిన అంగడి విల్సన్ అలియాస్ విల్సన్‌బాబు, అలియాస్ లడ్డు, గజ్జెల వాసు, కవాటి ప్రసాద్ అలియాస్ చిన్న ముఠాతో దోపిడీ చేయించారు. బాజీ పరారు కాగా మిగిలిన నలుగురు పోలీసులకు చిక్కారు. 246 గ్రాముల బంగారు ఆభరణాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన అంతర్జాతీయ సాహిత్య సదస్సు



పావపీర్ ఆవిష్కరణలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో జానపద సంస్కృతి, సాహిత్యంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. పలు ఖండాలు, దేశాల సంస్కృతులు, వారసత్వ సంపద, ఆచారవ్యవహారాలు, తదితర అంశాలపై విద్వాంసులు, పరిశోధకులు సమర్పించిన 120 పత్రాలపై చర్చించారు. కెనడా, అస్ట్రేలియా, మలేషియా, తదితర దేశాలతోపాటు, భారతదేశంలోని వివిధ ప్రాంతాలనుంచి 300మంది వక్తలు ఆన్‌లైన్‌లో తమ సందేశాలను పంపి, చర్చల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సునీలారాణి, సిస్టర్ సుశీల, తెలుగు-హిందీ విభాగాధిపతి మహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

29న నిధి ఆప్‌కే నికత్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఈ నెల 29న 'నిధి ఆప్‌కే నికత్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం' నిర్వహిస్తున్నామని ప్రాంతీయ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. ఈపీఎఫ్‌ఐ ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, ఇతర ఫిర్యాదుల దాఖలులో నిబంధనలు, క్లెయిమ్‌ల తిరస్కరణకు కారణాలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్లు, కొత్తగా కవర్ కాబడిన వారు తమ ఫిర్యాదులను నిధి ఆప్‌కే నికత్ అని పేర్కొంటూ సమర్పించాలన్నారు. ఏలూరు జిల్లా గోపాలపురంలో సర్వారాయ షుగర్స్ బాట్లింగ్ యూనిట్, పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు సంధ్య మెరైన్, నిధి ఆప్‌కే నిఖత్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

అధ్యక్షా..

అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లోని పలు సమస్యలను లేవనెత్తారు. వారేమన్నారంటే..

• వాటర్ గ్రిడ్‌కు రూ.118 కోట్లు మంజూరు



అమృత్-2 పథకంలో తణుకు పట్టణానికి గోదావరి జలాలు తరలించేందుకు గ్రిడ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.118కోట్లు మంజూరు చేసింది. పట్టణంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. 2027 నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి చెబుతున్నారు. ఏ ప్రాతిపదికన 2027నాటికి పనులు పూర్తిచేస్తారు. మొత్తం ప్రాజెక్టు ఒకే ఏజెన్సీకి కాంట్రాక్టరు ఇస్తున్నారా లేక తణుకు పట్టణానికి చెందిన ప్రాజెక్టుని ఒక కాంట్రాక్టరుకు ఇస్తున్నారా. కొత్తగా ఎన్ని కుళాయిలు ఇవ్వబోతున్నారు. ఎన్ని కిలోమీటర్లు మేర పైపులైన్లు వేయబోతున్నారు.

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

అక్టోబరు 3న క్యాబినెట్‌లో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుని 2027 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు.

• అర్హులందరికి తల్లికి వందనం ఇవ్వాలి



తల్లికి వందనం అర్హులైన కొంతమందికి రాలేదు. ఆధార్‌కార్డు వివరాల్లో కొంత మందికి కరెంటు మీటర్లు రెండు మూడు ఉన్నట్లు చూపుతున్నాయి. మరికొంత మందికి రెండు, మూడు స్థలాలు ఉన్నట్లు ఆధార్‌కార్డుల్లో నమోదయ్యాయి. వాస్తవానికి వారికి కరెంటు మీటర్లు, స్థలాలు లేవు. అర్హత ఉన్నప్పటికి కొంతమంది తల్లికి వందనం పథకం రాలేదు. తప్పుగా ఎంటరైన వివరాలను సచివాలయంలో సరి చేశాం. స్టేటస్‌లో అండర్ పాసెస్ అని వస్తున్నాయి. వీటన్నిటిని సరిచేసి వచ్చే ఏడాదైనా వీరందరికి తల్లికి వందనం ఇవ్వాలి.

- ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

• అంతర్జాతీయ విమాన సర్వీసులు ఇవ్వాలి



రాజధానికి విజయవాడ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ఇవ్వాలి. విదేశాల నుంచి వచ్చే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమైనా వారానికి ఒకటో రెండో అంతర్జాతీయ విమాన రాకపోకలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై దృష్టి పెట్టి రాజధాని నగరం నుంచి అంతర్జాతీయ విమాన రాకపోకలు జరిగేటట్లు చూడాలి. విదేశాల నుంచి వచ్చే వారు హైదరాబాద్ విమానాశ్రయం చేరుకుంటున్నారు. దుబాయ్, గల్ఫ్ నుంచి కార్మికులు హైదరాబాద్ విమానాశ్రయంలో దిగితే ఇబ్బందులు లేవు. విజయవాడలో దిగితే కస్టమ్స్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు.

- ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

• నాయకపోడులకు ఎస్టీ ధ్రువీకరణ ఇవ్వాలి



చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోట మండలంలో 1500 మందికిపైగా నాయకపోడు కులస్తులు నివసిస్తున్నారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో వారికి ఎస్టీ కుల ధ్రువీకరణ ఇచ్చారు. వీరంతా టీడీపీ అభిమానులని గత వైసీపీ ప్రభుత్వంలో సర్టిఫికెట్లు ఇవ్వలేదు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. నాయకపోడు సంప్రదాయాలు పాటిస్తున్నా విద్యలో రిజర్వేషన్ ఫలాలకు దూరమవుతున్నారు. మైదాన ప్రాంతంలో ఉన్న వీరికి ఎస్టీ సర్టిఫికెట్‌లు ఇవ్వాలి.

- చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

• సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థి దశలో యువత సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సాంకేతిక విద్యను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కళాశాలలను కంపెనీలకు అనుసంధానం చేశారు. 2024-25 విద్యాసంవత్సరానికి 1945 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వారిలో 1865 మందికి ఉద్యోగాలు రావడం శుభపరిణామం. పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. విద్యాశాఖ మంత్రి మాత్యులు పాలిటెక్నిక్ కళాశాలలపై దృష్టిసారించి వాటిని బలోపేతం చేయాలి. - గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

తణుకు, ఏలూరు, ఆచంట, చింతలపూడి, ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి)

అథ్లెటిక్స్‌లో రంజనికి రజతం



పతకం సాధించిన రంజని

ఏలూరు రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన 36వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఏలూరు జిల్లాకు చెందిన వి.రంజని మిడిల్ రిలే విభాగంలో రజత పతకం సాధించింది. రంజనిని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

స్వర్ణాంధ్రలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్

నరసాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీతారామపురంలోని స్వర్ణాంధ్ర కళాశాలలో నావెల్ యూనిట్ వారి ఎస్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్‌లు ప్రారంభించారు. 2025 సంవత్సరానికి గానూ ప్రవేశ ప్రక్రియ శుక్రవారం సాయంత్రం వరకు నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండర్ చిట్టి రోహిత్ కుమార్ అధ్యక్షతన విద్యార్థులకు శరీర దారుఢ్య, రాత, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ముఖాముఖీ ద్వారా 18 మందిని ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లెఫ్టినెంట్ సంజిత్ రౌత్రాయ్, కళాశాల చైర్మన్ కె.వి సత్యనారాయణ, కోశాధికారి వెంకటేశ్వరస్వామి, డెరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ ఎస్ సురేష్ కుమార్, కెర్ టేకర్ ఆఫీసర్ ఇస్తా మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జనసేన నాయకుడి వేధింపులు.. మహిళ ఆత్మహత్యా యత్నం

మొగల్తూరు, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మొగల్తూరులో జన సేన నాయకుడు వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మొగల్తూరు పంచాయతీ పరిధి వేగివారిపేటకు చెందిన వేగి లక్ష్మీ భర్త రెవెన్యూలో గ్రామ సేవకుడిగా ఉండటంతో ఆకుటుంబ ఆదాయాలు పరిగణనలోకి తీసుకుని గత ప్రభుత్వ హయాంలో ఇంటి నివేశ స్థలం కేటాయించారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకున్నారు. ఇంటిని నిర్మించుకున్న తనను అదే ప్రాంతానికి చెందిన ఒక జనసేన నాయకుడు తన కోరిక తీర్చాలని లేకుంటే మీకు ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు స్థలం ఖాళీ చేయిస్తానంటూ తరచూ బెదిరించాడు. దీనితో మనస్తాపానికి గురైన లక్ష్మీ పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి లక్ష్మీని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

తణుకు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హెప్సిబ అన్నారు. శనివారం వీధి వ్యాపారులతో డిజిటల్ విక్రయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు నుంచి పీఎం స్వానిధి పథకంలో రుణాకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇప్పటికే మొదటి విడతలో రూ.15వేలు రెండవ విడతలో రూ.25వేలు, మూడవ విడతలో రూ.50వేలు చొప్పున బ్యాంకర్ల రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు.

పీ4 సర్వేపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 సర్వేపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఉల్లాస్‌పై మహిళలకు అవగాహన

ఆచంట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం అక్షరాస్యత కార్యక్రమం ఉల్లాస్ పథకం పెదమల్లంలో గురువారం ప్రారంభించారు. 15 సంవత్సరాలు అంతకంటే ఎక్కువగా ఉన్న నిరక్ష్యరాస్యులను లక్ష్యంగా చేసుకొని వారికి అక్షరాస్యత, నైపుణ్య శిక్షణ, డిజిటల్ నైపున్యాలను అందించే విధంగా ఈ పథకం కేంద్రం రూపొందించిందని బీజేపీ నాయకులు తెలిపారు.

అర్బన్ బ్యాంకు నికర లాభం రూ.90లక్షలు

నరసాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి):ది నరసాపురం కో-ఆపరేటివ్ అర్బ న్ సొసైటీ బ్యాంకు మహాజన సభ శుక్ర వారం బ్యాంకు కార్యాలయంలో జరిగి ంది. దీనికి సొసైటీల ఆడిట్ అధికారి, ఇన్ చార్జి జోసఫ్‌పాల్ అధ్యక్షత వహించారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రూ.90 లక్షలు నికర లాభం సాధించిందని, సభ్యులకు 9శాతం డివిడెండ్ ఇవ్వాలని సభ తీర్మానిం చింది. ఈ ఏడాది మార్చి నాటికి సొసైటీ రూ.29 కోట్ల డిపా జిట్లు కలిగి ఉందని, అందులో రూ.25కోట్లు అప్పులు ఇచ్చినట్లు వివరించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నరసాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండలంలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా డిమాండ్ చేసింది. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న బాలిక కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

ఆరుగొలను సొసైటి అభివృద్ధికి సహకరించాలి



సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):ఆరుగొలను సొసైటీ రైతులకు సేవలందించేందుకు తమకు సహకరించాలని సొసైటి త్రిసభ్య కమిటి చైర్మన్ ఉప్పలపాటి వీరవెంకట సత్యనారాయణ శుక్రవారం డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, డీసీఎంఎస్ చైర్మన్ మురళికృష్ణలను కోరారు. ఏలూరులో జరిగిన డీసీఎంఎస్ సర్వసభ్య సమావేశంలో ఆరుగొలను సొసైటి పరిస్థితిపై వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణను సర్వసభ్య సమావేశంలో సత్కరించారు.

	ముప్పిడి వెంకటేష్, స్పెషల్ ఆఫీసర్ ఎస్.వి.దుర్గాధర్, కార్యదర్శి కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం
పిచ్చికల రాజారావు, సర్పంచ్ వై.సురేష్‌బాబు, కార్యదర్శి చినతాడేపల్లి	పిల్లా రాంబాబు, సర్పంచ్ పి. ముత్తయ్య, కార్యదర్శి, దండగర్ర
ములకాల సూర్యారావు, సర్పంచ్ కె. శ్రీను, కార్యదర్శి, జగ్గన్నపేట	చుండ్రు తేజస్విని, సర్పంచ్ వి.రామాచారి, కార్యదర్శి, బంగారుగూడెం
గూడవల్లి హనుమంతు, సర్పంచ్ ఎం. మాధవి, కార్యదర్శి, కొత్తూరు	సరిపల్లె పద్మ, సర్పంచ్ పూడి సరస్వతి, కార్యదర్శి, మారంపల్లి
మర్లపాటి వీర వెంకట సుబ్బలక్ష్మి, సర్పంచ్ జి.వి. సంజీవ్, కార్యదర్శి, మెట్టఉప్పరగూడెం	రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, సర్పంచ్ ఆ. ఫణీంద్రకుమార్, కార్యదర్శి, నీలాద్రిపురం
బొనిగే పోతున, సర్పంచ్ కె.ఆనంద్‌కుమార్, కార్యదర్శి, పట్టింపాలెం	చీకట్ల పుష్ప లక్ష్మీకుమారి, సర్పంచ్ బి. ఫణీంద్రకుమార్, కార్యదర్శి, పుల్లాయిగూడెం
చింతా వెంకట్రావ్, సర్పంచ్ కె.వి.చక్రవర్తి, కార్యదర్శి, రామన్నగూడెం	దండే కనకబాబు, సర్పంచ్ ఎం. మనీషా, కార్యదర్శి, ఉప్పరగూడెం
కేతిరెడ్డి మాధవి, సర్పంచ్ ఎస్.రఘునాధ రాజు, కార్యదర్శి, వీరంపాలెం	ఎలిపే గాంధీ, సర్పంచ్ అంకం శ్రీరామకృష్ణ, కార్యదర్శి, వెంకట్రావుపాలెం

వనచర్ల అప్పన్నస్వామి, సర్పంచ్ యుగంధర్ శ్రీనివాస్, కార్యదర్శి కావలిపురం గ్రామ పంచాయితీ	రామాయణం జగదీశ్వరరావు, సర్పంచ్ షేక్ సాహెన్, కార్యదర్శి కె.కుముదవల్లి గ్రామ పంచాయితీ
జుత్తిగ వెంకట మహేశ్వరరావు, సర్పంచ్ టి. వీర్రాజు, కార్యదర్శి యర్రాయిచెరువు గ్రామ పంచాయితీ	బృందావనం గోపాలకృష్ణ, సర్పంచ్ పి.దుర్గాప్రసాద్, కార్యదర్శి రాపాక గ్రామ పంచాయితీ
ఉప్పలూరి లావణ్య, సర్పంచ్ కె.సంధ్యారాణి, కార్యదర్శి అయితంపూడి గ్రామ పంచాయితీ	కునుకు హేమకుమారి, సర్పంచ్ వి.వరలక్ష్మి కార్యదర్శి పేకేరు గ్రామ పంచాయితీ
పెచ్చేటి చంద్ర, సర్పంచ్ విజయ్ కుమార్, కార్యదర్శి పాదలాడ గ్రామ పంచాయితీ	ఉన్నమట్ల నాగమణి, సర్పంచ్ కె.శ్రీరామ్, కార్యదర్శి కాకిలేరు గ్రామ పంచాయితీ
కరారి చంద్రమణి, సర్పంచ్ యం.డాక్టర్ బాబు, కార్యదర్శి సూరంపూడి గ్రామ పంచాయితీ	ఘంటా సురేఖ, సర్పంచ్ బి.భరత్, కార్యదర్శి ఓగిడి గ్రామ పంచాయితీ
బొక్కా లక్ష్మీశ్రీనివాస్, సర్పంచ్ యం.డి.సాహిద్, కార్యదర్శి కొత్తపాడు గ్రామ పంచాయితీ	మామిడి ఫణీంద్ర వరప్రసాద్ లక్ష్మీ సర్పంచ్ ఆర్.వి.నరేష్ కార్యదర్శి కత్తవపాడు గ్రామ పంచాయితీ

మంతెన వి.ఎస్.ఎస్.రామలింగరాజు, సర్పంచ్ ఎ.ఊహారజని, కార్యదర్శి ఈడూరు గ్రామ పంచాయితీ	తానుకొండ దయామణి, సర్పంచ్ బి.జాన్, కార్యదర్శి పాలూరు గ్రామ పంచాయితీ	మంతెన రామసీత, సర్పంచ్ జి.శ్రీనివాసరావు, కార్యదర్శి కొమ్మర గ్రామ పంచాయితీ
పెనుమత్స వెంకట కృష్ణంరాజు, సర్పంచ్ జి.బాలకృష్ణ, కార్యదర్శి కంచుమర్రు గ్రామ పంచాయితీ	అడ్డాల భాను లలిత మహాలక్ష్మీ సర్పంచ్ యు.ప్రసాదరావు, కార్యదర్శి స్కిన్నెరపురం గ్రామ పంచాయితీ	వెలగల సుస్మిత, సర్పంచ్ వై.మునిరాజు, కార్యదర్శి ఆరవల్లి గ్రామ పంచాయితీ
పాలమరశెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్ పి.నాగశ్రీనివాసరావు, కార్యదర్శి ఎల్.ఎన్.పురం గ్రామ పంచాయితీ	కసిరెడ్డి బాల లక్ష్మీనారాయణ, సర్పంచ్ పి.మనోజ్ కుమార్, కార్యదర్శి బల్లిపాడు గ్రామ పంచాయితీ	వట్టికూటి అనంతలక్ష్మి సర్పంచ్ యు.ప్రసాదరావు, కార్యదర్శి ఉనికిలి గ్రామ పంచాయితీ
కాసుల వెంకటసత్యనారాయణ, సర్పంచ్ బి.జార్జి ప్రసాద్, కార్యదర్శి ఉరదాళ్లపాలెం గ్రామ పంచాయితీ	గంటా విజేత నాగరాజు, సర్పంచ్ జి.భాస్కర్, కార్యదర్శి అత్తిలి గ్రామ పంచాయితీ	వేగేశ్న ధన సత్యనారాయణరాజు, సర్పంచ్ మట్టా శ్రీకర్, కార్యదర్శి గుమ్మంపాడు గ్రామ పంచాయితీ
కేతా గౌరీపార్వతి రఘురామ్, సర్పంచ్ ఎన్.సునీల్‌కుమార్, కార్యదర్శి పాలి గ్రామ పంచాయితీ	పంపన సత్యవతి, సర్పంచ్ జి.శ్రీనివాసరావు, కార్యదర్శి వరిఘేడు గ్రామ పంచాయితీ	చింతా రామయ్య, సర్పంచ్ బి.జార్జి ప్రసాద్, కార్యదర్శి మంచిలి గ్రామ పంచాయితీ
శీలబోయిన వెంకట ప్రసాద్, సర్పంచ్ కె.అనిల్ కుమార్, కార్యదర్శి దంతుపల్లి గ్రామ పంచాయితీ	బండి వెంకటలక్ష్మి సత్యనారాయణ, సర్పంచ్ బి.ఎన్.చంద్రకేదేశ్వరరావు, కార్యదర్శి కె.ఎస్.గట్టు గ్రామ పంచాయితీ	కొండూరి లీలా మణికంఠ, సర్పంచ్ పి.మనోజ్‌కుమార్, కార్యదర్శి తిరుపతిపురం గ్రామ పంచాయితీ

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మీరాగ్రంథాలయంలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఆర్టీసీలో అనేక ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్నారు.

'బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి'

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):అసెంబ్లీలో మెగాస్టార్ చిరంజీవిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడిన తీరుపై బహిరంగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత చిరంజీవి యువత నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా తాడేపల్లి గూడెంలో వీరంతా శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. తనకు తాను అతీత శక్తిగా భావించుకుంటూ మెగా స్టార్ కుటుంబంపై గతంలో కూడా అనేక సార్లు అవమానకరంగా మాట్లాడారన్నారు. వివాదాలకు దూరంగా ఉండే చిరంజీవి వాటిపై స్పందించలేదన్నారు. అభిమానులుగా తాము కూడా మనసెరిగి సంయమనం పాటిస్తున్నామన్నారు. బాలకృష్ణ కుటుంబం తీవ్ర వేధింపులకు గురై, జైలపాలైనప్పుడు అండగా నిలిచింది, ఆయన కుంటుంబం అధికారంలోకి రావడానికి కృషిచేసింది మెగా కుటుంబమే అనే విజ్ఞత మరచి బాలకృష్ణ అసెంబ్లీలో చిరంజీవి ప్రతిష్టను దిగజార్చేవిధంగా మాట్లాడటమేమిటని ప్రశ్నించారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం: కలెక్టర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు (జీఎస్‌టీ 2.0) ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై నెల రోజుల సెలబ్రేషన్స్ కార్యక్రమం, సీజనల్ కండిషన్స్, పీఎం సూర్యఘర్, బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు భూ సంబంధిత అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టే ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు దసరా నుంచి నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిచాలని అన్నారు. జీఎస్టీ 2.0 వల్ల రాష్ట్రానికి సుమారు రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గుతున్నప్పటికీ ప్రతి కుటుంబానికి 10 నుంచి 15 శాతం సొమ్ము ఆదా అవుతున్న నేపథ్యంలోప్రభుత్వం జీఎస్టీ 2.0 స్వాగతించడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులకు జీఎస్టీ ప్రచారానికి సంబంధించి నెలరోజుల కార్యక్రమం వివరాలను తెలియజేస్తూ ఈనెల 25 నుంచి ఇంటింటికీ జీఎస్టీ ఫలాలు పేరిట ప్రచారం నిర్వహించాలని అన్నారు. గూగుల్ మీట్‌లో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి. అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

గణపవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సదుపాయాలు గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు అన్నారు. శుక్రవారం అప్పన్నపేట, గణపవరంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నూకారపు సుధాకర్, మూరా అలంకారం, కూటమినేతలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు విచారణ వేగవంతం చెయ్యాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులకు సంబంధించి నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయ్యాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి. సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై జిల్లా కలెక్టర్ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు తహసీల్దార్లు సంబంధిత ధ్రువ పత్రాలను త్వరితగతిన పంపించాలన్నారు. 2023-24 సంవత్సరానికి 35 కేసులకు సంబంధించి 48లక్షల రూపాయలు బాధితులకు పరిహారం అందించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం మే 2025 నుంచి ఇప్పటివరకు 11 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

సొసైటీల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గణపవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పరిపుష్టి సాధించేందుకు సొసైటీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గణపవరం మండల సొసైటీల త్రిసభ్య కమిటీ చైర్మన్‌లు, డైరెక్టర్లు, కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులును క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గణపవరం సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాశీపాడు సొసైటీ చైర్మన్ కొలనువాడ శ్రీనివాసరాజు, ముగ్గళ్ల సొసైటీ చైర్మన్ గురుజు సూరిబాబు, కార్యదర్శులు బీటీఏ నారాయణ, రామకృష్ణంరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు వినతిపత్రం అందిస్తున్న సొసైటీల చైర్మన్‌లు, కార్యదర్శులు

'విశాఖ ఉక్కును కాపాడాలి'

భీమవరంటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కును కాపాడాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఎం నాయకుడు చింతకాయల బాబురావు అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సమావేశం బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకణ చేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. తక్షణం ప్రైవేటీకరణ చర్యలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికా విధించిన సుంకాల వల్ల ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మాటలు చెప్పడం ఆపి వారిని ఆదుకొనే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పెరుగుతాయన్నారు. జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్ మాట్లాడుతూ యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్‌రోడ్లు నిర్మించాలన్నారు. టిడ్కో నివాస ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు.



విజయీభవ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

విజయీభవ దసరా సంబరాలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయీభవ, దిగ్విజయీభవ అంటూ చిన్నారులు విల్లులు చేత పట్టుకుని పద్యాలు పాడుతూ దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. వీరమ్మ పార్కు వద్ద ఉన్న భోగ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ నాయకుడు రావూరి అనంత్ మాట్లాడుతూ సాంప్రదాయబద్ధంగా దసరా విజయీభవ పండుగ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కె.భాగ్యలక్ష్మి, ఎన్.దమయంతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భీమవరం క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్ఐ మోహన్ వంశీ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన యర్రా మోహనసాయి (24) యాక్టివా వాహనంపై ఈ నెల 25వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయలుదేరి భీమవరం వస్తున్నాడు. రిలయన్స్ బంకు వద్దకు వచ్చేసరికి పాలకొల్లు వైపు నుంచి భీమవరం వైపు వస్తున్నలారీ అతి వేగంగా మోహనసాయి వాహనాన్ని ఢీకొంది. అతను కింద పడిపోగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహనవంశీ తెలిపారు.




































పీ4 అమలుపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

పాలకోడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన చేపట్టాలని ఆలోచనతో తలపెట్టిన పీ4 కార్యక్రమానికి సంబంధించి విస్తృత స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ సిబ్బందికి శుక్రవారం పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో వి.రెడ్డియ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పబ్లిక్, ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో పేదరికాన్ని నిర్మూలించాలని అన్నారు. సంపన్న వ్యక్తులు పేదలకు సహాయం అందించడానికి ముందుకు వచ్చే విధంగా ప్రోత్సహించాలన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారి రాపాక ప్రభాకర్, సహాయ ఎన్నికల అధికారి భావన సునీల్ తెలిపారు. నామినేషన్ల పరిశీలన ఉపసంహరణ పూర్తి అయ్యే సరికి ఒక్కొక్క నామినేషన్ ఉన్నాయని వారు తెలిపారు. అధ్యక్షులుగా మజ్జి వీర వెంకట సత్య వర ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా వీర జయరామాంజనేయులు (వీరాజీ), ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీ చక్రవర్తి గణేష్, జాయింట్ సెక్రటరీగా ఎం. ప్రసన్న కుమార్ ఎన్నికయ్యారు.

ఆవుకు గిట్టల తొలగింపు



ఆకివీడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆవుకి గిట్టలు పెరిగిపోయి నడవలేకపోతుండడంతో కొంతమంది కలుగజేసుకుని శుక్రవారం గిట్టలు కట్ చేయించారు. టీడీపీ నాయకుడు దూబా సురేష్ సోషల్ మీడియాలో ఆవు సమస్య గురించి పెట్టడంతో ఏఎంసీ డెరెక్టర్ యర్రా రవి ముందుకొచ్చారు. గిట్టలు కట్ చేయించిన తరువాత ఆవు ఫ్రీగా నడుస్తుంది.

చీరలు, భోజన పొట్లాలు పంపిణీ

ఆకివీడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైద్యులు మందపాటి రఘునాథరాజు జ్ఞాపకార్థం కెఆర్‌కే మూర్తిరాజు ఆర్థిక సహకారంతో శుక్రవారం పేద మహిళలకు చీరలు, భోజనం పొట్లాలు టీడీపీ కౌన్సిలర్ కిమిడి అరు ణకుమారి, నాగరాజులు అందచేశారు.

పెరుగుతున్న గోదావరి

ఆచంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు కారణంగా వరద నీరు గోదావరికి చేరుతుండటంతో మరలా గోదావరి ప్రవాహం కాస్త పెరిగింది. ఇటీవల పూర్తిగా తగ్గిన గోదావరి రెండు రోజులుగా కాస్త ప్రవాహం పెరగడంతో పుష్కరఘాట్‌లు మునిగాయి.

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ఆకివీడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ఇరవై వార్డులలో 120 మందికి శుక్రవారం ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. తోట సీతారాం, ధర్మరాజు, పల్లి అప్పిరెడ్డిల ఆర్థిక సహకారంతో కళ్ళజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్‌ల అధ్యక్షులు బుద్ధన చింతారావు, ప్రసన్న, రాజు, అహ్మద్ పాల్గొన్నారు.

80 మెడికల్ కిట్ల పంపిణీ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చవాకుల ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ డిపోలోని 80 బస్సులకు ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్‌లు పంపిణీ చేశారు. వీటిని ఆర్టీసీ డీఎం సుబ్బన్నరెడ్డికి అందించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ చవాకుల సూర్యనరేష్‌బాబు, మాజేటి రాజు, కృష్ణమోహన్, పవన్, రామకృష్ణ పాల్గొన్నారు.



భీమవరం భీమేశ్వరస్వామి ఆలయంలో మహిషాసుర మర్దినికి మహాలక్ష్మి అలంకారం.. కనకదుర్గ అమ్మవారికి మహాలక్ష్మి అలంకారం.. కాళ్లలో కనకదుర్గమ్మకు గాజుల అలంకారం.. గణపవరంలో లలితాదేవి అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

మహాలక్ష్మిగా అమ్మవార్ల దర్శనం

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రులు పురస్కరించుకుని భీమవరంలోని పలు దేవాలయాల్లోని అమ్మవార్లు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మెంటేవారితోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారిని మహాలక్ష్మి అలంకరణ చేశారు. అమ్మవారికి రూ.500, 200, 100, 50, 20, 10 కరెన్సీ నోట్లతో సుమారు రూ.4 లక్షలతో ధనలక్ష్మిగా అలంకరణ చేశారు. గునుపూడి గ్రామ దేవత శ్రీఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవార్లను శుక్రవారం ధనలక్ష్మి దేవిగా అలంకరణ చేశారు. అమ్మవారికి రూ.500, 200, 100, 50, 20,10 కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరణ చేసినట్లు ఆలయ ఈవో గొట్టుముక్కల సీతారామరాజు తెలిపారు. శ్రీరాంపురం రోడ్డులోని శ్రీజగన్మాత కనకదుర్గమ్మ అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరణ చేశారు. సోమేశ్వరాలయంలోని అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరణ చేశారు. భీమేశ్వరస్వామి ఆలయంలో మహిషాసుర మర్ధినీ అమ్మవారు లలితా త్రిపుర సుందరీ అమ్మవారుగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

కాళ్ళ: కోపల్లె గ్రామంలో కనకదుర్గమ్మ, పరాలమ్మ అమ్మవార్లకు శుక్రవారం గాజుల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని సుమారు 50 వేల గాజులతో అలంకరించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఐదవ రోజు శుక్రవారం గజలక్ష్మీగా శ్రీలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు.

గణపవరం: గణపవరంలోని చినరామచంద్రపురంలో వెంకయ్యవయ్యేరు ఒడ్డున ఉన్న శ్రీకనకదుర్గాదేవి లలితాదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ కాకర్ల విష్ణు శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కిటకిటలాడిన మావుళ్లమ్మ ఆలయం

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా శుక్రవారంనాడు మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూట్టారు. ఉదయం నుంచి క్యూలైన్ కొనసాగింది. ఆలయంలో కూడా రద్దీ కనిపించింది. సాయంత్రం కూడా కొనసాగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈవో నగేష్ పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్స్ సహకరించాలి



రైస్‌మిల్లర్స్‌తో సమీక్షిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్స్ తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లాలో రైస్ మిల్లర్స్ ప్రతిని ధులు, జిల్లా పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారు లతో స్థానిక భారతీయ విద్యా భవన్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ -2025 సంబంధించి రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైస్ మిల్లర్స్ సన్నద్ధం కావాలని అన్నారు. వచ్చేనెల 10వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ కొనుగోలు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేందుకు రైస్ మిల్లర్స్ సహకరించాలన్నారు. మిల్లర్స్ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా నాణ్యమైన గోనె సంచులు ఆర్ ఎస్ కే లకు పంపాలని అన్నారు. తేమ శాతంలో తేడాలు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు ఎండి ఇబ్రహీం, డిఎస్‌ఓ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు, ఏఎస్‌ఓ ఎం.రవిశంకర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరా మరాజు, సెక్రటరీ కె.శ్రీనివాస్, జిల్లాలోని రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ చేశారంటూ ఆందోళన

పాలకోడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం, డ్రెయినేజీ నిర్మాణం, స్థలం విక్రయం సందర్భంగా నెలకొన్న వివాదాల మూలంగా పలు దఫాలుగా కుల బహిష్కరణకు గురైనట్లు పెన్నాడ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ఆరోపించాయి. కుల బహిష్కరణ చేసి కులపెద్దల వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ శుక్రవారం పెన్నాడ పంచాయతీ కార్యాలయం వద్ద ఒక కులానికి చెందిన పలు కుటుంబాలు ఆందోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం కుల సంఘం కట్టుబాట్లను ధిక్కరించారనే నెపంతో సుమారు 28 మందిని సంఘం నుంచి వెలివేసినట్లు తెలిపారు. మూడేళ్ళ క్రితం నుంచి పలు దఫాలుగా వెలివేస్తూ వస్తున్నారని బాధితులు దొంగ నాగలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు తెలిపారు. తక్షణమే సంఘ పెద్దలు, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వీఆర్వో సుబ్రహ్మణ్యానికి వినతి పత్రం అందజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ రవివర్మ, ఆర్‌ఐ రాఘవరాజు స్థానిక పంచాయతీ కార్యాలయంలో బాధితులతో మాట్లాడారు. వివరాలు తీసుకున్నారు. సంఘ పెద్దలు అందుబాటులో లేకపోవడంతో విచారణను శనివారం నాటికి వాయిదా వేసినట్లు వీఆర్వో సుబ్రహ్మణ్యం తెలిపారు.

పీ4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

ఆచంట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వారికి మ్యాప్ అయిన బంగారు కుటుంబాలను కలిసి గతంలో నిర్వహించిన నీడ్ అసిస్మెంట్ సర్వేలో వారు తెలిపిన అవసరాలు సమకూరింది. లేనిది యాప్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రక్రియ ఈ నెల 30 లోపు పూర్తి చేయాలని, అన్ని శాఖల సచివాలయ సిబ్బంది పాల్గొనాలన్నారు. బంగారు కుటుంబాల అర్హతలు, మార్గదర్శ బాధ్యతలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో పూర్ణబాబ్జి, ఈవోపీఆర్‌డీ బుల్లి సూరన్న, శ్రీధర్ పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఏబీవీపీ నిరసన

భీమవరం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చెల్లించాల్సిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ భీమవరం పట్టణంలో ప్రకాశంచౌక్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ భీమవరం విభాగ కన్వీనర్ చందు, జగదీష్, సాయిభవాని తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు

కాళ్ళ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్యాయానికి గురైన కార్యకర్తలకు వైసీపీ డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పెద అమిరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఉండి ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజుతో కలిసి శుక్రవారం పార్టీ కార్యకర్తల కోసం 'డిజిటల్ బుక్' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడ, ఎవరికి ఏ అన్యాయం జరిగినా ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామన్నారు.